ఇలాగైతే నీరు పారేదెలా..

● పూడిపోయిన పిల్ల కాలువలు



బ్రాహ్మణపల్లె వద్ద పిచ్చి మొక్కలతో నిండి ఉన్న పిల్ల కాలువ

పులివెందుల రూరల్ : మండలంలోని ఏ కాలువలో చూసినా కాలువల నిండా పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. కాలువల్లో తూతూ మంత్రంగా పూడికను తొలగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వేంపల్లె చివర ఆయకట్టు వరకు నీరు అందించాలన్న లక్ష్యంతో లింగాల ఎడమ, కుడి కాలువలను నిర్మించారు. ఇందుకు కోట్లాది రూపాయల నిధులు కూడా ఖర్చు చేశారు. కొన్ని ప్రాంతాలలో నీరు వెళ్లాలంటే కాలువల్లో జమ్ము, పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఏనాడూ కూడా కాలువల్లో పేరుకపోయిన పూడిక గురించి పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. చివరి ఆయకట్టు వరకు ఉన్న భూములకు సాగునీరు వెళ్లాలంటే ప్రారంభంలోనే నీరు వెళ్లకుండా కాలువల్లో జమ్ము, పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లకపోతే పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం వర్షాలు కూడా అడపా దడపా పడుతున్నాయి. దీంతో రైతన్నలు పంటలు సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. బ్రాహ్మణపల్లె, చిన్న రంగాపురం తదితర గ్రామాలకు వెళ్లే పిల్ల కాలువలు కూడా పిచ్చి మొక్కలు, కంప చెట్లతో నిండి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలువల్లో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



జమ్ముతో నిండి ఉన్న కాలువ



కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు

రహదారి విస్తరణలో ఆటంకాలు

ముద్దనూరు : స్థానిక మండకేంద్రంలో జరుగుతున్న రహదారి విస్తరణ పనుల్లో అక్కడక్కడా ఆటంకాలు ఎదురవుతుండటంతో పనులు మందగమనంలో సాగుతున్నాయి. శనివారం స్థానిక ఆంధ్యాబ్యాంకు సమీపంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పనుల పురోగతిపై ఇళ్ళ యజమానులతో చర్చించారు. రహదారి విస్తరణలో కొంతమంది తమకు అన్యాయం జరుగుతోందని, పనులు చేపట్టిన సుమారు 1కి.మీ పరిధిలో కొలతల నియమాలు కొన్నిచోట్ల అధికారులు సక్రమంగా పాటించలేదని వాదించారు. ఒక్కోప్రాంతంలో ఒక్కోవిధంగా విస్తరణ చేపట్టారని, అవసరమైన మేర స్థలంలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పాతబస్టాండు కూడలి ప్రాంతంలో విస్తరణ పనుల్లో ఆటంకాలు తలెత్తుతున్నాయి. గతంలో కొన్ని చోట్ల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే ఈ సమస్యలు వస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని ఐదు పంచాయతీల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి మూడు రోజులపాటు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధి బాధ్యత సర్పంచ్‌లదే అన్నారు. గ్రామాలలో ఏవైనా సమస్యలు నెలకొని ఉంటే వెంటనే వాటిని అధికారులు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు కూడా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే సర్పంచ్ దృష్టికి తీసుకొస్తే సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు,

కుట్రపూరిత ఆలోచనలు మానుకోవాలి

వేంపల్లె : కూటమి ప్రభుత్వం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్ర పూరిత ఆలోచనలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్లూరు సుదర్శన్ తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి కూటమి ప్రభుత్వం సెక్యూరిటీని తగ్గించేందుకు ఆలోచన చేస్తోందని, నిర్లక్ష్య వైఖరి చేపట్టడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం కనీసం రోప్ పార్టీ కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రజాదరణ కలిగిన నాయకుడు ప్రజల్లోకి వెళ్లే సమయంలో రోప్ పార్టీ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల నుండి దూరం చేయాలని కూటమి ప్రభుత్వం పన్నాగాలను పన్నితే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కాలగర్భంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు భద్రతను కట్టుదిట్టం చేయాలని కోరారు.

నిత్యజీవితంలో ఏఐ పాత్ర విభజించలేనిది



ఆన్‌లైన్ ఏఐ అప్లికేషన్స్ వర్క్‌షాపులో విద్యార్థులు, తదితరులు

వేంపల్లె : దైనందిన జీవితంలో ఏఐ పాత్ర విభజించలేనిదని కళాశాల ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. స్థానిక వైఎస్సార్ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం ఏఐ అప్లికేషన్స్‌పై ఆన్‌లైన్‌లో ఒకరోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతవరకు పరిశోధనలకు బహుళ జాతి కంపెనీలకు పరిమితమైన ఏఐ ప్రస్తుతం ఇంటింటా ప్రతి ఒక్కరి జీవితంలో ప్రధాన పాత్ర నిర్వహించబోతోందని విద్యార్థులకు తెలియజేశారు. ఏఐను నిజజీవితంలో ఉపయోగించుకోవడం ద్వారా అనేక సమస్యలను అతి సులువుగా గృహిణులకు, మిగతా వారికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్ర, కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి ఎస్.కిరణ్మయి, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అరవింద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

చింతకొమ్మదిన్నె : చిన్నముసలరెడ్డిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాత మార్తల నరేంద్రారెడ్డి సహకారంతో సుమారు రూ.15 వేలు విలువచేసే నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ తదితర స్టేషనరీ సామగ్రిని ఎంఈఓలు సుజాత, రమాదేవిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల చేత విద్యార్థులకు విద్యాబోధన తోపాటు, ఆటలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఉపయోగించుకోవలసిందిగా విద్యార్థులను, వారి తల్లితండ్రులను కోరారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో కోత పెడితే ఊరుకునేది లేదు

పులివెందుల రూరల్ : కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద పంపిణీ చేయనున్న అన్నదాత సుఖీభవ పథకంలో కోత పెడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే రైతు పెట్టుబడి కింద ప్రతి ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకు నయా పైసా కూడా రైతులకు దక్కలేదన్నారు. ఇదిగో.. అదిగో అంటూ కాలం గడుపుతున్నాడని ఎద్దేవా చేశారు. వాస్తవానికి మే చివరిలో రైతులకు డబ్బు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటివరకు ఒక్క పైసా కూడా జమ కాలేదన్నారు.

ప్రభుత్వాల రుణ, రాయితీ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ సెంటర్ ఐపీఓ పవన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు మీటింగ్ హాలులో శనివారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రుణ, రాయితీ పథకాలపై నిరుద్యోగ యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ సెంటర్ ఐపీఓ పవన్ మాట్లాడుతూ పీఎంఈజీపీ, ఎంఎస్‌ఎంఈ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ రుణాలతో పాటు విత్తనాలు, ఎరువుల, అలాగే పొలం చుట్టూ కంచె వేసుకునేందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ అందిస్తోందన్నారు. వెటర్నరీ డాక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా అందించే రుణాలను 50 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. డీఆర్డీఏ బీపీఎం వెంకటస్వామి మాట్లాడుతూ మహిళలకు అన్ని వ్యాపార రంగాలకు సున్నా వడ్డీతో రుణాలు ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ రవీంద్రారెడ్డి, రిటైర్డు హెడ్మాస్టర్ నరసింహులు, టీచర్ గురునాథం, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి నాగమణి, ఎమ్మార్పీఎస్ నాయకులు, నిరుద్యోగ యువత, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

వల్లూరు (చెన్నూరు) : పరిసరాల పరిశుభ్రత తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. చెన్నూరు గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలోని మురికి నీటిని రోడ్లపై పోయకూడదని తద్వారా రోడ్లు పాడై పోవడంతో పాటు, దోమల వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం నిన్నటి రోజు తొలగించిన వారసత్వ దిబ్బల స్థలాలను ఆమె పరిశీలించారు. చెన్నూరు గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో సురేష్ బాబు, సర్పంచ్ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వాహనాలకు పత్రాలు లేకపోతే సీజ్ చేస్తాం



వేంపల్లెలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహులు



ముద్దనూరులో ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న సీఐ దస్తగిరి



సింహాద్రిపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రవికుమార్

వేంపల్లె : వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని సీఐ నరసింహులు హెచ్చరించారు. శనివారం సాయంత్రం వేంపల్లెలోని స్థానిక పులివెందుల బైపాస్ రోడ్డులో వాహనాలను సీఐ తనిఖీ చేశారు. వాహనాలకు సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులులేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారందరూ సరైన రికార్డులు పెట్టుకుని వాహనాలను నడపాలని, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహనాదారులు సహకరించాలన్నారు. మోటర్ బైకులో వెళ్లి వారు తలకు హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణప్రాయం నుండి బయట పడేందుకు వీలు ఉంటుందన్నారు. చిన్న పిల్లలకు మోటర్ బైకులను ఇవ్వరాదని, అతి స్పీడ్‌గా వెళ్లడంతో యాక్సిడెంట్స్ జరుగుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే అపరాధరుసుం

ముద్దనూరు : వాహనాలు నడిపేసమయంలో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే తగిన అపరాధ రుసుం విధిస్తామని సీఐ దస్తగిరి తెలిపారు. శనివారం స్థానిక పాతబస్టాండు ఆవరణలో ఆయన భద్రాతానియమాలపై అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. హెల్మెట్ వాడకపోవడం, లైసెన్స్, వాహనానికి సంబంధించి పత్రాలు లేకుండా సంచరించడం, అధికవేగం, మైనర్లు వాహనాలు నడపడం తదితర ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదుచేసి అపరాధరుసుం విధించనున్నట్లు, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు.

వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి

సింహాద్రిపురం : వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. శనివారం ఎల్లనూరు క్రాసింగ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి లైసెన్సులు లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే భారీ జరిమానాలు ఉంటాయని, అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. అలాగే గ్రామాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు తెలపాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి దేవాలయానికి 2 ఎకరాలకుపైగా ఉన్న భూమిని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని తహసీల్దార్ సాయినాథరెడ్డికి శనివారం గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. అంకాలమ్మగూడూరు, కడపనాగాయపల్లె, బొజ్జాయిపల్లె గ్రామస్తులందరూ కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 392ఏ రెండు ఎకరాలకు పైబడి పురాతన చింత వనంలోని భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించడంతో భక్తులకు, వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారని తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోము కొండారెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, సోమిరెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లతో నిండిన గ్రామీణ రహదారి



కంపచెట్లతో మూసుకపోయిన దుగ్గన్నగారిపల్లె రహదారి

వేముల : మండలంలోని దుగ్గన్నగారిపల్లెకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి కంపచెట్లతో నిండిపోయింది. కడప - పులివెందుల ప్రధాన రహదారి నుండి దుగ్గన్నగారిపల్లె గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో కంపచెట్లు రోడ్డుపైకి వ్యాపించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు వెళ్లాలంటే వాహనాలకు కంపచెట్లు తగులుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామం నుంచి అటు, ఇటు వైపు వెళ్లేవారు ఎదురుగా వస్తే వాహనాలను నిలుపుకోవాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. రెండు నెలలుగా రహదారి వెంబడి వెళ్లే గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాక రాత్రిపూట నడిచివెళ్లే వారు కంపచెట్లతో ఎక్కడ విష పురుగులు వస్తాయోనని భయంగా వెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలం వస్తే కంపచెట్లు ఏపుగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఇలాగే వదిలేస్తే గ్రామ రహదారి మూసుకుపోయి అవకాశం ఉందని వారు వాపోతున్నారు.

సంక్షేమ సారథి నరేంద్ర మోడీ

చక్రాయపేట : భారత ప్రధాని నరేంద్ర మోడీ సంక్షేమ సారథి అని బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లెలో ప్రధానిగా మోడీ 11 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాజారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, వాణిజ్యవిభాగం అధ్యక్షుడు దొంతు సుమన్, మండల కార్యదర్శి గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మరణించినవారికి యోగా సర్టిఫికెట్

వల్లూరు (చెన్నూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి మరణించిన వారు కూడా అర్హులేనా అంటూ వైఎస్సార్‌సీపీ కడప జిల్లా నేతలు ధ్వజమెత్తారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తులకు యోగా కార్యక్రమంలో మంచి ప్రదర్శన చేశారంటూ సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. సచివాలయం-1 పరిధిలోని ఎల్లటూరు షేక్ చిన్నసయ్యద్ (86) ఈ ఏడాది ఫిబ్రవరి రెండో తేదీ మరణించాడు. అయితే ఈనెల 21న యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మంచి ప్రదర్శన చేశారంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పంపించారన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

జమ్మలమడుగు : పశ్చిమ బెంగాల్‌లో న్యాయశాస్త్రం చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు సుభహాన్ తెలిపారు. శనివారం పట్టణంలోని శ్రీనివాస డిగ్రీకాలేజి విద్యార్థులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. బెంగాల్‌లోని అర్జీకార్ మెడికల్ కాలేజిలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార సంఘటన మరువక ముందే మళ్లి లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం దేశంలోనే సంచలనం కలిగించింది. దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. దేశంలో బలమైన చట్టాలు, శిక్షలు అమలు జరిగినప్పుడే ఇటువంటి సంఘటనలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థినిపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ



ఎన్ఆర్ఐ అందించిన బెంచిలతో ఉపాధ్యాయులు

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ నరసింహ పాఠశాలకు 15 బెంచిలు వితరణగా అంతజేశారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన నరసింహ 1989-90 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేశారు. ప్రస్తుతం ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. చదువుకున్న పాఠశాలకు అవసరమైన రూ.40 వేలు విలువచేసే బెంచిలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంఓ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణంలోని అర్బన్‌హెల్త్ కేంద్రాన్ని శనివారం జిల్లా ప్రోగ్రాం మెడికల్ అధికారి శశిభూషన్‌రెడ్డి సందర్శించి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు మెరుగైన సేవలు అందిస్తే రోగులకు కూడా ఆసుపత్రులపై నమ్మకం కలుగుతుందన్నారు. వైద్యులు సకాలంలో వచ్చి ఆసుపత్రిలో ఉండాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుంది. కాబట్టి రోగులకు మెరుగైన వైద్యం అందించినప్పుడే నమ్మకం కలుగుతుందన్నారు. అనంతరం టీబీ రహిత భారతదేశాన్ని నిర్మించుకుందాం పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో దాగుడుమూతలు



కొప్పర్తి చెరువు ఆక్రమిత భూమిలో మళ్లీ బోర్డును పాతుతున్న రెవెన్యూ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : మండలంలో కోట్లాది రూపాయల విలువైన భూములపై ఆక్రమణదారులు విచ్చలవిడిగా బరితెగిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చింతకొమ్మదిన్నె తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఆక్రమణ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతడం.. ఆక్రమణదారులు అర్ధరాత్రులు తొలగించడం, తిరిగి పాతడం... మళ్ళీ తొలగిస్తుండటంతో అధికారులు ఏకంగా కేసులు పెట్టాల్సిన స్థాయికి వెళ్తోంది. అధికారులపైన ఆక్రమిత భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేయకుండా తీవ్ర వత్తిడులు చేయిస్తున్నట్లు సమాచారం.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : జులై 5వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం ఆమె న్యాయవాదులు, పోలీస్ అధికారులతో కలసి జాతీయ లోక్ అదాలత్‌పై సమాశేవాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న కేసులు ఉన్న కక్షిదారులు మాట్లాడుకుని రాజీ కావాలన్నారు. దీంతో కాలయాపనతో పాటు డబ్బులు వృథా అయ్యే అవకాశం లేదన్నారు. అనంతరం ఆమె పట్టణంలోని సబ్ జైల్, బాలికల కళాశాలలో ఉన్న బీసీ హాస్టల్‌ను తనీఖి చేశారు. ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకునిరావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ పక్కన ఉన్న నీటి సంప్‌లో గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు పట్టణ ఎస్ఐ రామకృష్ణ శనివారం తెలిపారు. ఎస్ఐ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్‌లో తిరుగుతూ మాటలు సరిగా రాకుండా జేబుల్లో న్యూస్ పేపర్లు ఉంచుకునే వాడు. శనివారం రైల్వేస్టేషన్ పక్కన మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహన్ని బయటతీశారు. ఎత్తు సుమా 5.5 అడుగులు ఉండి 30 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఛామన రంగు చాయ కలిగి అతని శరీరంపై గోదుమ రంగు ఫుల్‌షర్ట్, తెలుపు రంగు కట్ బనియన్, నలుపు రంగు నైట్ ప్యాంటు కలిగి కుడి చేతికి కాషాయం రంగు ధారం ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.